రహదారులకు మహర్దశ

- గ్రామాల్లో జోరుగా సిమెంట్ రోడ్ల నిర్మాణం
- శివారు ప్రాంతాలకూ వేస్తున్న వైనం
- అరబిందో ఫార్మా సహకారం పల్లెల్లో అభివృద్ధి పనులు



కవలపాడు వెళ్లేందుకు నిర్మించిన ప్రధాన రోడ్డు



కవలపాడులో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డు



ఎస్.అన్నవరం కొబ్బరితోట వీధిలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

తుని రూరల్: గ్రామాల్లో రహదారులకు ఇక మహర్దశ పట్టనుంది. మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎస్.అన్నవరం పంచాయతీలో ప్రాధాన్యతా క్రమంలో కవలపాడు, కొత్త సూరవరం, కొబ్బరితోట వీధుల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచనలతో అరబిందో ఫార్మా కంపెనీ ఈ రహదారులను నిర్మిస్తోంది. రూ.10.80 కోట్లతో రహదారులు, సమాంతరంగా పైకప్పులతో సహా కాలువలు నిర్మించనున్నారు. ఒకటి, మూడు సచివాలయాల పరిధిలో రహదారుల పనులు శరవేగంగా జరుతున్నాయి. ఈ పనులు పూర్తయిన తర్వాత రెండు, నాలుగు సచివాలయాల పరిధిలో రహదారులు నిర్మించనున్నారు. ఆ తర్వాత కాలువలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. కవలపాడులో దీర్ఘకాలంగా అంతర్గత రహదారులు లేకపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే రాకపోకలకు అష్టకష్టాలు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు నుంచి బయటపడినట్టే.

శరవేగంగా పనులు

ఎస్.అన్నవరం శివారు కవలపాడులో అంతర్గత రహదారుల నిర్మాణానికి గతేడాది అక్టోబర్ 21న రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా శంకుస్థాపన చేశారు. గడిచిన మూడు నెలల్లో ఎస్.అన్నవరం నుంచి కవలపాడు వెళ్లే ప్రధాన రహదారితో సహా 12 శివారు గ్రామాలైన కవలపాడు, కొత్త సూరవరం, కొబ్బరితోట వీధుల్లో 12 రహదారులను నిర్మించారు. ఈనెలాఖరుకు మరిన్ని రహదారులు నిర్మించనున్నారు. మరోపక్క ఆర్ అండ్ బీ నిధులు రూ.40 లక్షలతో రెండు రోజులుగా తుని నుంచి కవలపాడు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరు, ఈదటం, పాల్‌మాన్‌పేట మీదగా కాకినాడ జిల్లా తొండంగి మండలం అద్దరిపేట, వేమవరం, ఒంటిమామిడి, ఉప్పాడ, మీదగా జిల్లా కేంద్రానికి (బీచ్‌రోడ్డు మీదగా) తక్కువ సమయంలో సులభంగా చేరుకోవచ్చు.

కష్టాలు తీరాయి



తునికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న కవలపాడు గ్రామస్తులు రాకపోకలకు దశాబ్దాలుగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. తుని-కవలపాడు, ఎస్.అన్నవరం-కవలపాడు వెళ్లే ప్రధాన రహదారులను నిర్మించడంతో ప్రయాణ కష్టాలు తీరాయి. కవలపాడు రోడ్డు నిర్మాణంతో రెండు జిల్లాల ప్రయాణికులకు మేలు జరిగింది.

– కునసం దొరబాబు, ఎస్.అన్నవరం

మంత్రి చొరవతో రహదారులు



ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో కవలపాడు, కొత్త సూరవరం, కొబ్బరితోట వీధులతో పాటు శివారు ప్రాంతాలు అభివృద్ధికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషి చేశారు. మంత్రి పోత్సాహంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చింది. రూ.10.80 కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణం పూర్తయ్యింది.

– చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ, ఎస్.అన్నవరం

సుబ్రహ్మణ్యస్వామికి రుద్రాభిషేకం

తొండంగి: ఒంటిమామిడిలో విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సుబ్రహ్మణ్యస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శంకరణం గోవిందరావు ఆధ్వర్యంలో స్వామివారికి విఘ్నేశ్వర పూజ, సుబ్రహ్మణ్యస్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారి జాతర

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో వీరమ్మ పేరంటాలు అమ్మవారి జాతర మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలతో భక్తి గీతాలను ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్తుల సహకారంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: మొబైల్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.సతీష్‌బాబు సూచించారు. మండలంలోని జగపతినగరం, రామచంద్రపురం, సింహాద్రిపురం గ్రామ సచివాలయాల్లో ఈ నెల 10వ తేదీ వరకూ మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తారన్నారు. ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, మార్పులు చేర్పులు, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం వంటి సేవలు అందిస్తారన్నారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

బీమా చెక్కు అందజేత



ఒమ్మంగి బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో బాధిత కుటుంబానికి గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి చినబాబు, రామిశెట్టి బులి రామకృష్ణ వైఎస్సార్ బీమా చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన వంగలపూడి దొరబాబు ఇటీవల మృతి చెందాడు. ఆయనన భార్య మేరీకి వైఎస్సార్ బీమా చెక్కును అందజేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పేదలకు అనుకూలం



కొల్లా శ్రీనివాస్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023-24 సంవత్సరం బడ్జెట్ పేద, మధ్య తరగతి వర్గాలకు అనుకూలమని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ద్రవ్యలోటును 5.9 శాతానికి పరిమితం చేస్తూ మౌలిక వసతులకు గత బడ్జెట్ కంటే 33 శాతం అధికంగా కేటాయించడం అభినందనీయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షించిన ఆత్మ నిర్భయ్ భారత్‌కు ఈ బడ్జెట్ ఊతమిస్తుందన్నారు. ఈ బడ్జెట్‌తో అన్నివర్గాలకు మేలు జరుగుతుందని చెప్పారు.

లంపీస్కిన్ వ్యాధి నివారణకు చర్యలు

తుని: పట్టణంలో తిరుగుతున్న పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ప్రజారోగ్యశాఖ అధికారి శేఖర్ గురువారం తెలిపారు. పురవీధుల్లో తిరుగుతున్న 12 పశువులను మార్కండ్రాజుపేట పార్కుకు తరలించి లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా మందును స్ప్రే చేశారు. రెండు రోజులకు ఒకసారి స్ప్రే చేయడం వలన ఇతర పశువులకు వ్యాధి సోకదన్నారు. పశువుల యాజమానులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

చేతిపంపులు ప్రారంభం



కొండతిమ్మాపురంలో చేతి పంపును ప్రారంభిస్తున్న మైఖేల్ వైజర్

ఏలేశ్వరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం చేతిపంపులు ప్రారంభించారు. మండలంలోని లింగంపర్తి, ములగలమెట్ట, కొండతిమ్మాపురం, రమణయ్యపేట గ్రామాల్లో నాసా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేతి పంపులను షేబా సంస్థ డైరెక్టర్ రాజకులపతి, వెల్ఫర్ లైఫ్ డైరెక్టర్ మైఖేల్‌వైజర్ చేతిపంపులను ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేతి పంపులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. యార్లగడ్డ రాజాచౌదరి, చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారథి, పాల్గొన్నారు.

టీడీపీలో కొత్తగా ఎవరూ చేరలేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ శివకుమార్

ప్రత్తిపాడు రూరల్: టీడీపీలో కొత్తగా ఎవరూ చేరలేదని ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్ అన్నారు. మండలంలోని ధర్మవరంలో గురువారం ఆయన వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. టీడీపీలో బుధవారం చేరిన వారు మొదటి నుంచి ఆ పార్టీలోనే ఉన్నారన్నారు. ఇప్పుడు వారిని వైఎస్సార్ సీపీ వారు అనడం హాస్యాస్పదగా ఉందన్నారు. ఈ తరహా రాజకీయాలు చేయడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల చినబాబు, బెంతుకుర్తి అబ్బాయి, బాబులు, నానిపల్లి చంటి, బొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదానం

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీఅన్నదానం ఏర్పాటు చేశారు. ఉప్పలపాడు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

కోటనందూరు: మండలంలోని కొత్తకొట్టాంలో నాసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని నాసా ప్రతినిధి, ఏపీఎస్సీ మెంబర్ నూతలపాటి సోనీవుడ్, సర్పంచ్ దొగ్గా లక్ష్మి ప్రారంభించారు. రాఫా మెడికల్ సెంటర్ డాక్టర్ సామ్యుమిశెల్ 395 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పథకాలతో అన్నివర్గాలకూ లబ్ధి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గోకవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



గోకవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సచివాలయం-1, 2 పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. మహిళలు, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి పథకాలు సక్రమంగా అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వెంటనే వారికి పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఎమ్మెల్యే అడగ్గా డ్రైనేజీలు నిర్మించాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జలజీవన్ మిషన్ పథకంలో గోకవరానికి రూ.కోటి మంజూరైందని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.8 లక్షలతో నిర్మించే డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, మంగరౌతు శ్రీను, గంధం గణేష్, షెడ్డు శ్రీను, ఉనుకూరి ఏసురత్నం, తహశీల్దార్ శ్రీనివాస్, ఈఓపీఆర్‌డి రాజేశ్వరరావు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రౌతులపూడిలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ



గృహసారథులు శిక్షణలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్రప్రసాద్

రౌతులపూడి: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. రౌతులపూడిలో గురువారం వైఎస్సార్ సీపీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కుడుపూడి భరత్‌తో కలసి ఎమ్మెల్యే గృహసారథులు, పార్టీ నాయకులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత మూడన్నరేళ్లలో 95 శాతానికి పైగా ఎన్నికల హామీలను నెరవేర్చారన్నారు. పార్టీలో ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా చూడాలని సూచించారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కష్టించే పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైస్ ఎంపీపీలు సాయి, లక్ష్మీభాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సోమరౌతు భాస్కరబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత



తూర్పులక్ష్మీపురంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్, వలంటీర్



కాకినాడలో మత్స్యకారుడు చిట్టియ్యకు పింఛను అందజేస్తున్న వలంటీర్ అనుదీపిక

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు మైలపల్లి చిట్టియ్య అనారోగ్యంతో కాకినాడలోని ఆరుణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిట్టియ్య పింఛను లబ్ధిదారుడు కావడంతో గ్రామ వలంటీర్ ఇంజరపు అనుదీపిక ఆస్పత్రికి వెళ్లి చిట్టియ్యకు పింఛన్ అందజేసింది. అలాగే బెండపూడికి చెందిన వృద్ధుడు తూరుబిల్లి మరిడియ్యకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి గ్రామ వలంటీర్ జి.లోవలక్ష్మి కాకినాడ వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేసినట్టు పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి తెలిపారు. కాకినాడ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన గ్రామ వలంటీర్లు అనుదీపిక, లోవలక్ష్మిలను ఎంపీడీఓ పసుపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, ఇతర అధికారులు అభినందించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా రెండోరోజు గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగింది. తెల్లవారుజాము నుంచి గ్రామ వలంటీర్ల, వైఎస్సార్‌సీపీ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. మండలంలోని తూర్పు లక్ష్మీపురంలో మాజీ సర్పంచ్ యిజనగిరి సత్యవతి, వలంటీర్లు, భద్రవరంలో సర్పంచ్ కూనపురెడ్డి సుబ్బారావు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వలంటీర్లు ఇంటికే తెచ్చి పింఛన్లు అందజేయడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రత్తిపాడు: మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ తన ఉదారతను చాటుకున్నారు. ప్రత్తిపాడు దుర్గమ్మ వీధికి చెందిన అత్తి లక్ష్మణ్ జ్వరంతో ఇటీవల మృతి చెందాడు. గురువారం మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు శేరు కృష్ణ, ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోకవరం: విద్యుత్ స్తంభం నుంచి ప్రమాదవశాత్తూ కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే...రాజానగరం మండలం దివాన్‌చెరువుకు చెందిన బొర్రా వీరభద్రశేఖర్ (38) ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌లో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. ఈ నెల 1న గోకవరంలో ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి కేబుల్ నెట్‌వర్క్ వైరు సరి చేస్తుండగా పొరపాటున అతని చెయ్యి విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడికి గోకవరం ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తుని పట్టణంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణ శివారు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ కోలా శ్రీను ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మున మున్సిపాలిటీ-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి, కౌన్సిలర్లు గడప గడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణంలోరోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పరంగా చేకూరిన లబ్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్య చక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పొమర్తి మహేష్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై ఆకతాయిల దాడి

రౌతులపూడి: స్థానిక ఇండియన్ బంకు సమీపంలో గిడజాంకు చెందిన పలువురు విద్యార్థులపై రౌతులపూడికి చెందిన శేఖర్, పాము అనే ఇద్దరు ఆకతాయిలు మద్యం తాగి దాడి చేశారంటూ గిడజాంకు చెందిన పి.సాయి, జి.లోవరాజు, జి.కుశరాజు, ఎస్.శివమణికంఠతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. రెండు రోజుల క్రితం పాఠశాల ముగించుకొని ఇంటికి వెళ్లే సమయంలో అదే వ్యక్తులు తమతో అసభ్యంగా ప్రవర్తించి దుర్భాషలు ఆడారని విద్యార్థులు తెలిపారు. గురువారం సాయంత్రం కూడా విద్యార్థులు పాఠశాల ముగించికొని ఇంటికి వెళ్లే సమయంలో ఆకతాయిలు ఆపి దాడి చేయడానికి ప్రత్నించగా విద్యార్థులు విషయాన్ని తమ తల్లిదండ్రులకు ఫోన్‌లో తెలపారు .దీంతో విద్యార్థుల తల్లిండ్రదులు అక్కడకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాన రహదారులపై రోడ్డుకు ఇరువైపులా సుమారు రెండు గంటల పాటు వాహనాలను నిలిపివేశారు. దీంతో రౌతులపూడి – తుని, రౌతులపూడి – కోటనుందూరు వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి



లంపకలోవల బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బంగార్రాజు

ప్రత్తిపాడు: బీహార్‌లోని పాట్నాలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగార్రాజు కోరారు. ఈ మేరకు మండలంలోని లంపకలోవ గ్రామం నుంచి చేపట్టిన బైక్ ప్రచార ర్యాలీ గురువారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్యాన్ని రక్షించండి-భారత దేశాన్ని రక్షించండి అనే నినాదంతో ఈ మహాసభలను నిర్వహిస్తున్నామన్నారు. మోదీ పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ సంఘటితమై కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. మండలంలోని పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి తదితర గ్రామాల మీదుగా ర్యాలీ కొనసాగింది. లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం, కాకర రత్నకుమారి, రాజాల రత్నం, దుమ్ముల సింహాచలం పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గోకవరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న నాయకులు

గోకవరం: పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. మండలంలోని గోకవరం, గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు గురువారం జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాల్లో సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, పీఎంసీ చైర్మన్లు కణితి శ్రీను, పి.చిన్ని, ఎంఈఓ బి.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడికి సత్కారం



ప్రత్తిపాడులో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనును సత్కరిస్తున్న బీసీ నాయకులు

ప్రత్తిపాడు: జిల్లాలో వెనుకబడిన వర్గాల ప్రజలు (బీసీలు) రాజకీయంగా ఎదుగేందుకు ప్రధాన పార్టీలు అవకాశం కల్పించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీను కోరారు. గురువారం సాయంత్రం ప్రత్తిపాడు వచ్చిన ఆయనను బీసీ నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్న నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన తదితర పార్టీలు ఎమ్మెల్యే టిక్కెట్లను బీసీలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గొనగాల వెంకటరమణ, ఒమ్మి గంగరాజు, కిలపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతం

ఏలేశ్వరం: బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంటా బాలుదొర తెలిపారు. శక్తికేంద్ర ప్రవాస యోజనలో భాగంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు గట్టెం వెంకట రమణ గురువారం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ నెల 4న తునిలో జరిగే జిల్లా కార్యవర్గ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం బూత్ కమిటీ అధ్యక్షులు, సభ్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డి లోవరాజు, గొల్లపూడి సత్యనారాయణ, రాతికింద కృష్ణారావు, ఏనుగు ధర్మరాజు, కురాకుల రాజా పాల్గొన్నారు.

వంట గ్యాస్ వినియోగంపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో గురువారం వంట గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. సిందూ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీస్ మేనేజర్ కాపారపు రాజబాబు మహిళలకు వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏటా గ్యాస్ ట్యూబ్‌ను నాణ్యతను పరిశీలించి మార్చుకోవాలన్నారు. స్టవ్, ట్యూబ్, రెగ్యులేటర్ కండీషన్‌లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ రొంగల నాగేశ్వరరావు, గ్యాస్ వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామికి శ్రీచక్రస్నానం



ఏవీ నగరంలో స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం అభిషేకాలు చేస్తున్న పండితులు

తొండంగి: మండలంలోని ఏవీ నగరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం నిర్వహించారు. తొలుత పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకీలో గ్రామ కోనేటి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి శ్రీచక్రస్నానం చేయించారు. దేవస్థానం వ్యవస్థాపకులు యనమల రామ్మృష్ణుడు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.